క్లుప్తంగా

ఆన్‌లైన్‌లో విద్యా బోధన

సాక్షి ఎఫెక్ట్...

సాలూరు: పాచిపెంట మండలం పి.కోనవలస గిరిజన గురుకుల బాలికల కళాశాలలో కెమిస్ట్రీ లెక్చరర్ లేరని పేర్కొంటూ పి.కోనవలసలో సాగని కెమిస్ట్రీ బోధన శీర్షికన సాక్షిలో గత నెల 30న ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. ఈ మేరకు ఐటీడీఏ డీడీ గయాజుద్దీన్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసారు. సాధ్యమైనంత వరకు త్వరలో కెమిస్ట్రీ అధ్యాపకుడిని నియమించడానికి ప్రభుత్వానికి నివేదికలు సమర్పించామని అన్నారు. ప్రస్తుతం విద్యార్థినులకు కెమిస్ట్రీ సబ్జెక్ట్‌ను ఆన్‌లైన్ ద్వారా బోధనా తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. సుమారు 156 మంది విద్యార్థినులు చదువుతున్న కళాశాలలో కెమిస్ట్రీ అధ్యాపక పోస్ట్ ఖాళీగా ఉండడం వలన విద్యార్థినుల చదువులకు ఆటంకం కలగకుండా ఆన్‌లైన్ ద్వారా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు.

స్వర్ణ గ్రామ పంచాయతీ వివరాలు అప్‌లోడ్ చేయాలి

- డీపీఓ కొండలరావు



విక్రంపురంలో రికార్డులు పరిశీలిస్తున్న డీపీఓ కొండలరావు

కొమరాడ: స్వర్ణ గ్రామ పంచాయతీల వివరాలు అప్‌లోడ్ వేగవంతం చేయాలని జిల్లా గ్రామ పంచాయతీ అధికారి టి.కొండలరావు సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని విక్రంపురం సచివాలయంలో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో అసెస్‌మెంట్ (ఆస్తుల) వివరాలను స్వర్ణ గ్రామ పంచాయతీ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. జిల్లాలో 1,87,559 అసెస్‌మెంట్లు ఉన్నాయని వాటిలో 1,12,637 అసెస్‌మెంట్‌లు నమోదు చేయడం జరిగిందన్నారు. 2036 అసెస్‌మెంట్లను పాక్షికంగా నమోదు చేశారని తెలిపారు. ఆయన వెంట ఈఓపీఆర్‌డీ రాధాకృష్ణ, పంచాయతీ కార్యదర్శి భీమయ్య తదితరులు ఉన్నారు.

ప్రజా సహకారంతోనే డ్రగ్స్‌కు చెక్



బక్కుపేటలో మాట్లాడుతున్న ఎస్‌ఐ రాజేష్

సీతానగరం: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో జరుగుతున్న డ్రగ్స్, సైబర్ నేరాల అదుపునకు ప్రజల సహకారం అవసరమని ఎస్‌ఐ ఎం.రాజేష్ అన్నారు. సంకల్పం కార్యక్రమంలో భాగంగా బక్కుపేటలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వ్యసనాల బారిన పడుతున్నారని, చిన్న చిన్న తగాదాలతో పోలీస్‌స్టేషన్‌కు వచ్చి విలువైన సమయానివృథా చేసుకోవద్దని సూచించారు. మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే జీవితం నాశనం అవుతుందన్నారు. వాహన చోదకులు నిబంధనలు పాటించాలన్నారు. పోలీసు సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

తుప్పల తొలగింపు



చిలకలపల్లి వద్ద తుప్పలు తొలగింపజేసిన ఎస్‌ఐ

బలిజిపేట: రోడ్డు భద్రతలో భాగంగా చిలకలపల్లిలో మలుపుల వద్ద బలిజిపేట ఎస్‌ఐ సింహాచలం ఆధ్వర్యంలో తుప్పలను మంగళవారం తొలగించారు. ప్రమాదకరమైన మలుపులతో సతమతమవుతున్న ప్రయాణికులకు ఎదుటి వాహనాలు కనిపించకుండా రోడ్డును కప్పేస్తూ అల్లుకుపోయిన తుప్పలు, డొంకలను ఎస్‌ఐ సింహాచలం ఆధ్వర్యంలో తొలగింపజేశారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణంలో ప్రత్యేక పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న యువరాజు, పెద్దలు, భక్తులు

సాలూరు: వచ్చే ఏడాది పట్టణంలో శ్యామలాంబ తల్లి పండ జరగనున్న నేపథ్యంలో దేవతలకు మంగళవారం ప్రత్యేక పూజలు చేసారు. గ్రామదేవతలైన దేశమ్మతల్లి, కొత్తమ్మ తల్లి, ముత్యాలమ్మ తల్లి, సామలమ్మ తల్లి, బంగారమ్మ తల్లులకు భక్తులు పసుపు, కుంకుమలు చెల్లించారు. సాలూరు యువరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసారు.

సలసల కాగుతున్న..

వంటనూనెల ధర



షాపులలో విక్రయిస్తున్న మూడు లీటర్లు, ఐదు లీటర్ల వంటనూనె క్యాన్లు


నిత్యావసర సరుకుల ధరల పెరుగుదలతో పేద, మధ్య తరగతి ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. వంట నూనెల ధరలైతే అందనంత ఎత్తుకు పెరిగాయి. ధరల నియంత్రణలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

- సామాన్యులకు అందనత్త ఎత్తులో ధరలు
- లీటరుపై రూ.50 వరకు పెరుగుదల
- ధరల నియంత్రణలో కూటమి ప్రభుత్వం విఫలం

బలిజిపేట: కూటమి పాలనలో నిత్యావసరల ధరల సామాన్యుడికి అందనంత ఎత్తుకు ఎగబాకాయి. ఏం కొనలేక.. ఏం తినలేక సరుకుల ధరలు చూసి హడలిపోతున్నారు. ముఖ్యంగా వంట నూనెల ధరలు సలసల కాగుతున్నాయి. వీటి ధరలతో వంటింటిలో మహిళలు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ఇంటి వద్ద కుటుంబ సభ్యులకు ఇష్టమైన వంటకాలు కూడా సంతృప్తిగా వండి వడ్డించలేకపోతున్నామని వారు ఆవేదన చెందుతున్నారు. ఓ వైపు వంట నూనెల ధరలు మండిపోతుంటే.. మరోవైపు కూరగాయల ధరలు కూడా అదే స్థాయిలో ఉన్నాయి. మార్కెట్‌కు వెళ్లొచ్చే వినియోగదారుడి జేబుకు చిల్లులు పడుతున్నాయి. ఎన్నికల వేళ ధరల నియంత్రణకు తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే తగు చర్యలు చేపడతామని చెప్పిన నేతలు నేడు ఏమైపోయారని వంటింటి మహిళలు మండిపడుతున్నారు. వంట నూనెలపై దిగుమతి సుంకాలు 20 శాతానికి పెంచేయడంతో వాటి ధరలు సామాన్యుడికి అందకుండా పోతున్నాయని పేద, మధ్యతరగతి ప్రజలు వాపోతున్నారు. వంటింటిలో ఎక్కువగా వినియోగించే ఉల్లి, వెల్లుల్లి, టమాట వంటి వాటి ధరల నియంత్రణ కూడా అదుపు తప్పింది. వెల్లుల్లి అయితే కిలో రూ.400 వరకు పలుకుతోంది. దీంతో వినియోగదారులు బెంబేలెత్తిపోతున్నారు.

ఉత్తి మాటలే..

తాము అధికారంలోకి వస్తే నిత్యావసర సరుకుల ధరలను నియంత్రిస్తామని ఎన్నికల ముందు హామీలు ఇచ్చిన కూటమి నేతలు ఏమైపోయారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ధరల నియంత్రణకు ప్రభుత్వం ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతోనే ఇలా మండిపోతున్నాయని ప్రజలు విమర్శిస్తున్నారు. వంట నూనెల దిగుమతిపై కేంద్రం 12.5 శాతం నుంచి 32.5 శాతానికి సుంకం పెంచడంతోనే లీటరు దాదాపు రూ.50 వరకు పెరిగిందని ధ్వజమెత్తుతున్నారు. ఈ ధరలు మరింత పెరిగే అవకాశాలున్నాయని వ్యాపారులు చెబుతుండడంతో ప్రజలు మరింత నిరాశకు గురవుతున్నారు.



మార్కెట్‌లో ప్రస్తుతం వంట నూనెల ధరలు

వంట నూనె రకం	పాతధర(లీటరు)	ప్రస్తుత ధర (లీటరు)
పామాయిల్	రూ.95	రూ.130
ఫ్రీడం	రూ.115	రూ.160
సోయాబీన్	రూ.115	రూ.150
వేరుశనగ	రూ.160	రూ.180
సన్‌డ్రాప్	రూ.180	రూ.220



విక్రయిస్తున్న ఆయిల్ ప్యాకెట్లు

ఇంతలా పెరగడం గతంలో చూడలేదు..

నిత్యావసర సరుకుల ధరలు ఇంతలా గతంలో పెరగడం ఎన్నడూ చూడలేదు. ధరల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. సంతృప్తికంగా భోజనం చేయాలన్నా లెక్కలేసుకోవాల్సి వస్తుంది. ఆయిల్ ధరలు, కూరగాయల ధరలు కొనాలంటే ఆలోచించాల్సిన రోజులు వచ్చేసాయి.

– మహాలక్ష్మి, వలగర, బలిజిపేట

సబ్సిడీ ఊసు లేదు

కేంద్ర ప్రభుత్వం వంట నూనెలపై సుంకాన్ని భారీగా పెంచింది. పామాయిల్, సన్‌ఫ్లవర్, సోయాబీన్ వంటి వంట నూనెలకు గతంలో బేసిక్ కస్టమ్స్ సుంకాలు ఉండేవికావు. ప్రస్తుతం వాటిపై కేంద్రం 20శాతం డిగుమతి సుంకాన్ని విధించింది. శుద్ధి చేసిన వంట నూనెలపై గతంలో 12.5 శాతం ఉన్న సుంకాన్ని 32.5 శాతానికి పెంచేసింది. దీంతో లీటరుపై రూ.35 నుంచి 50వరకూ ధరలు పెరిగాయి. గతంలో వంటనూనె, కందిపప్పు ధరలు పెరిగినప్పుడు చౌకధరల దుకాణాల ద్వారా ప్రభుత్వాలు సరఫరా చేసేవి. వంటనూనెలు, నిత్యావసర సరుకుల ధరలను నియంత్రించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

గిరిజన యూనివర్సిటీ తరలిస్తామనడం అన్యాయం



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

మక్కువ: గిరిజన యూనివర్సిటీ నిర్మాణానికి శంకుస్థాపన చేపట్టి, ఇప్పుడు ఇతర జిల్లాకు తరలిస్తామనడం అన్యాయమని సీపీఎం నాయకులు ప్రభాకర్, ఇందిర అన్నారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. సాలూరు నియోజవర్గం కుంటినవలస గ్రామంలో గిరిజన యూనివర్సిటీ నిర్మాణానికి 2023 ఆగస్టు నెలలో శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం భవన నిర్మాణ పనులు చేపడుతున్నారన్నారు. ఇటీవల రాష్ట్ర విద్యా శాఖ మంత్రి, మన్యం జిల్లా నుంచి గిరిజన యూనివర్సిటీని ఇతర జిల్లాకు తరలిస్తామని అసెంబ్లీలో ప్రకటించడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. మన్యం జిల్లాలో గిరిజనులు, దళితులు, పేద బీసీ వర్గాలు చెందిన 95శాతం మంది ఉన్నారన్నారు. జిల్లాలో హరిజన, గిరిజన ఎమ్మెల్యేలు నలుగురు ఉన్నప్పటికీ ఏ ఒక్కరు స్పందించకపోవడం దారుణం అన్నారు. అనంతరం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రామరావు, కృష్ణ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత



రికార్డులను పరిశీలిస్తున్న సీడీపీఓ సురేఖ

సీతానగరం: బలిజిపేట ఐసీడీఎస్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై సిబ్బంది దృష్టి సారించాలని సీడీపీఓ సురేఖ అన్నారు. మండలంలోని సూరంపేట, మరిపివలస, చిన్నారాయుడుపేట, గుచ్చిమి అంగన్‌వాడీ కేంద్రాలను, ప్రీ స్కూల్‌పిల్లలకు ఇస్తున్న పౌష్టికాహారాన్ని, సరుకుల నిల్వలను ఆమె మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు, ప్రీస్కూల్ పిల్లలకు సకాలంలో పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. పిల్లలకు అవసరమైన వనరులు సమకూర్చాలని సూచించారు. అనంతరం గుచ్చిమి అంగన్‌వాడీ కేంద్రంలో కూరగాయలను చూసి పిల్లలు తీసుకునే ఆహారంలో వినియోగించాలని సూచించారు. సూపర్‌వైజర్, ఆయా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

జొన్న సాగు లాభదాయకం



అంటిపేటలో జీరోటిల్లేజ్ విధానంతో నాటుతున్న జొన్న విత్తనాలు పరిశీలిస్తున్న ఏఓ అవినాష్

సీతానగరం: వరి కోతలు ముగిసిన తరువాత వరి మొజ్జుతో ఉన్న మళ్లలో జీరోటిల్లేజ్ విధానం ద్వారా మొక్కజొన్న విత్తనాలు నాటడం వల్ల తక్కువ ఖర్చుతో ఎక్కువ విస్తీర్ణంలో వేయడం వల్ల మంచి లాభాలు సమకూరుతాయని ఏఓ ఎస్.అవినాష్ అన్నారు. మండలంలోని అంటిపేటలో వరి మాగాణి భూమిలో జీరో టిల్లేజ్ విధానం ద్వారా జొన్న విత్తనాలు నాటే పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీరోటిల్లేజ్ విధానం ద్వారా జొన్న విత్తనాలు నాటడం వలన రైతుకు పనిభారం తగ్గుతుందని, కూలీల బెడద, దుక్కి ఖర్చు తగ్గుతుందని అన్నారు. మండలంలోని ఇప్పటికే లక్ష్మీపురం, వెంకటాపురం, గెడ్డలుప్పి, తామరఖండి, చినబోగిలి గ్రామాల్లో వరి మాగాణీ భూమిల్లో జీరోటిల్లేజ్ విధానం ద్వారా తీసిన(వరి మొజ్జులకు పక్కనే కత్తవతో లేదా యంత్ర పరికరంతో తీసిన) దుక్కి వేయని పొలంలో తీసిన గోతుల్లో జొన్న విత్తనాలు వేయడం వలన సులభంగా ఉంటుందన్నారు. రైతుకు దుక్కి ఖర్చు, సాగు సమయం, తేమ శాతం పెరగడం వలన మొక్కలు మొలక శతం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

గోశాలల నిర్మాణం వేగవంతం



మండలంలో మంజూరైన గోశాలల నిర్మాణాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు అన్నారు. కోటసీతారాంపురంలో జరుగుతున్న గోశాల నిర్మాణ పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. పాడి పశువులున్న రైతులకు ఉపాధి హామీ పథకం ద్వారా మొదటి విడతగా 24 గోశాలలు, రెండో విడతలో 26 గోశాలలు మంజూరు చేసినట్టు తెలిపారు. మొదటి విడతగా మంజూరు చేసిన నిర్మాణాలు వివిధ స్థాయిలో ఉన్నాయన్నారు. పనులను మండల పశు వైద్యాధికారులు, ఏపీఓ పర్యవేక్షణలో ఉపాధి హామీ పథకం ఇంజినీరింగ్ అధికారులతో రికార్డింగ్ చేయించుకోవాలని సూచించారు.

– సీతానగరం

రహదారి బురదమయం

మక్కువ – దుగ్గేరు రహదారి చర్చి జంక్షన్ సమీపంలో రహదారి శిథిలావస్థకు చేరుకొంది. దీంతో బురదమయంగా తయారైంది. ఈ మార్గంలో ప్రయాణించే వాహనచోదకులు భయంభయంగా ప్రయాణిస్తున్నారు. రహదారి మొత్తం గోతులమయం కావడంతో వాటిని తప్పించబోయి ప్రమాదాలకు గురవుతున్నారు. రహదారిలో ఏర్పడిన గోతుల్లో కంకర మట్టి వేసి కప్పేశారు. ఇటీవల కురిసిన వర్షాలతో రహదారిలో వేసిన కంకర మట్టి కరిగిపోవడంతో మొత్తం బురదమయమైంది.

– మక్కువ



మలేరియాపై నిరంతర నిఘా



మలేరియాపై నిరంతర నిఘా తప్పనిసరని, అప్పడే మలేరియా అదుపులో ఉంటుందని జిల్లా సహాయ మలేరియా అధికారి సూర్యనారాయణ అన్నారు. పార్వతీపురం మండలం డోకిశీల పీహెచ్‌సీని ఆయన మంగళవారం సందర్శించారు. ఆశాల సమావేశంలో ఆశా కార్యకర్తలకు, కమ్యూనిటీ హెల్త్ వర్కర్‌లకు మలేరియా పట్ల అవగాహన కల్పించారు. ఫ్రైడే డ్రైడే రోజు ప్రజలకు పదేపదే చెప్పడం ద్వారా పారిశుద్ధ్యం పట్ల ప్రజల్లో చైతన్యం తేవాలన్నారు. ప్రతీ ఆశా కార్యకర్త దగ్గర మలేరియా టెస్టు కిట్లు, మందులు సిద్ధంగా ఉంచాలని పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఐశ్వర్యకు సూచించారు. జిల్లా కన్సల్టెంట్ రామచంద్రరావు, సబ్ యూనిట్ అధికారి ధనుంజయ, పీహెచ్‌సీ సూపర్‌వైజర్ శ్రీనివాస్, ఎల్‌టీ ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

– పార్వతీపురం టౌన్

ఓటర్ల జాబితాపై ఎందుకంత గోప్యం

సాలూరు:



వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్

నీటి సంఘాల ఎన్నికల ఓటర్ల జాబితా ఎవరిస్తారని వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్ ప్రశ్నించారు. పట్టణంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ నీటి సంఘాల ఎన్నికల ఓటర్ల జాబితా కోసం తహసీల్దార్‌ను అడిగితే ఇరిగేషన్ అధికారులు వద్ద ఉందని తెలిపారన్నారు. ఇరిగేషన్ అధికారులను అడిగితే తహసీల్దార్ వద్ద ఉందని పేర్కొన్నారు. జాబితాను ఇవ్వడానికి అధికారులు ఎందుకు ఇలా ఒకరిపై ఒకరు నెడుతున్నారో అర్థం కావడం లేదన్నారు. ఓటర్లు జాబితాను అంత గోప్యంగా ఉంచడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. మండల స్థాయి ప్రజాప్రతినిధులనే అధికారులు ఈ విధంగా తిప్పితే, సాధారణ ప్రజల పట్ల వీరి తీరు ఏ విధంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చని అన్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి నీటి సంఘాల ఓటర్ల జాబితాను ఇవ్వాలని కోరారు.

దివ్యాంగులు మనో ధైర్యంతో ముందుకు సాగాలి

దివ్యాంగులు మనో ధైర్యంతో ముందుకు సాగాలని పలువురు పేర్కొన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా పలుచోట్ల నిర్వహించిన క్రీడా పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. దివ్యాంగులను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించి ముందుకు సాగేలా సహకరించాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంఈఓలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, భవిత కేంద్రాల ఉపాధ్యాయులు, దివ్యాంగులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



సీతానగరం: సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ సూరిదేముడు



బలిజిపేట: దివ్యాంగులకు ప్రోత్సాహకాన్ని అందిస్తున్న ఎంఈఓ 1 సామల



మక్కువ: చిన్నారికి బహుమతిని అందిస్తున్న ఎంఈఓ సత్యనారాయణ

సమస్యలు పరిష్కరించే వరకూ పోరాటం

పార్వతీపురం టౌన్: తమ న్యాయమైన సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించే వరకూ పోరాటం కొనసాగిస్తామని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు స్పష్టం చేశారు. పార్వతీపురం ఐటీడీఏ కార్యాలయం ఎదుట జరుగుతున్న దీక్షలు మంగళవారం 14వ రోజుకు చేరాయి. దీక్షలకు గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్, చెరువుల సంరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు వంగల దాలినాయుడు మద్దతుగా దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నడూ లేని విధంగా జోనల్ పోస్టులైన గురుకుల ఉపాధ్యాయ పోస్టులు డీఎస్సీలో ఎలా కలుపుతారని ప్రశ్నించారు. కార్యక్రమంలో అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు సరస్వతి, లక్ష్మి, జ్యోతి, కన్నమ్మ, ఇందిర, షర్మిల తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ విగ్రహానికి తొలగిన ముసుగు



వైఎస్సార్ విగ్రహానికి తొలగిన ముసుగు

సాలూరు: ఎన్నికల కోడ్ ముగిసినా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి ఉన్న ముసుగును తొలగించలేదని పేర్కొంటూ కోడ్ తొలగినా ముసుగు తీయరా ..? అనే శీర్షికన సాక్షిలో గత నెల 28న ప్రచురితమైన కథనంపై మున్సిపల్ అధికారులు స్పందించారు. పట్టణంలో మెయిన్‌రోడ్డు కూడలి వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి ముసుగును తొలగించారు.

బాల్య వివాహాలు నేరం : పీడీ



పాచిపెంట: మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ రాణి

పాచిపెంట: బాల్య వివాహాలు చేసుకోవడం వల్ల మహిళలకు భవిష్యత్తులో అనేక అనర్థాలు ఎదురవుతాయని, అలాంటి వివాహాలు చేయడం నేరమని ఐసీడీఎస్ పీడీ ఎం.ఎం.రాణి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మహిళా పోలీసులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలకు బాల్య వివాహాల నిర్మూలనపై మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ 2030 నాటికి బాల్య వివాహ రహిత భారతదేశంగా చేయడమే లక్ష్యమన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలపై గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. 11 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాల మధ్య ఉన్న డ్రాప్ అవుట్ విద్యార్థినిలంతా మళ్లీ బడిలో చేరేంచే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. సీడీపీఓ బొత్స అనంతలక్ష్మి, నోడల్ అధికారి రాజ్యలక్ష్మి, నీడ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి పి.వేణుగోపాలరావు, మండల విద్యాశాఖ అధికారులు పల్లి జోగారావు, సతీష్, స్థానిక ఎంపీటీసీ దండి ఏడుకొండలు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలి

సాలూరు: బాల్య వివాహాల నిర్మూలనకు అందరూ కృషి చేయాలని ఐసీడీఎస్ పీడీ రాణి అన్నారు. పట్టణంలో వైటీసీలో మంగళవారం కిశోర బాలికల వికాస్ కార్యక్రమంపై నిర్వహించిన ప్రాజెక్టు స్థాయి సమావేశంలో ముఖ్యఅతిథిగా ఆమె పాల్గొన్నారు. సీడీపీఓ విజయలక్ష్మి, ఎంపీడీఓ రమాదేవి, నోడల్ అధికారి రాజ్యలక్ష్మి, డీసీపీఓ సత్యనారాయణ, ఈఓ తిరుపతిరావు, డాక్టర్ శివకుమార్, నీడ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ వేణుగోపాలరావు, వైద్యారోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.